నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, మంగళవారం 19 మార్చి 2024 | NIZAMABAD


## టీజీ 16ఏ 0001 @ రూ.లక్ష




ఖలీల్‌వాడీ, మార్చి 18: రాష్ట్ర ప్రభుత్వం కొత్త వాహనాలకు టీజీ కోడ్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. దీంతో ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనదారులు ఆసక్తి కనబర్చారు. నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లో రవాణాశాఖ కార్యాలయాలుండగా ఫ్యాన్సీ నంబర్లకు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రూ.9,69,872 ఆదాయం వచ్చింది. నిజామాబాద్‌కు టీజీ 16 0001, ఆర్మూర్‌కు టీజీ 16 ఏ 0001, బోధన్‌కు టీజీ 16బీ 0001 నంబర్లను కేటాయించారు. ఇందులో టీజీ 16ఏ 0001 నంబర్ కోసం ఓ వాహనదారుడు రూ.లక్ష చెల్లించాడు. టీజీ 16 0789కు రూ.52, 66 5, టీజీ 16 0001కు రూ.50వేలు, టీజీ 16బీ 0333నంబర్ రూ. 30వేల ధర పలికింది. నిజామాబాద్ ఆర్టీవోకు ఫ్యాన్సీ నంబర్ల ద్వారా రూ.5,40,967, ఆర్మూర్‌లో రూ.1,38,585, బోధన్‌లో రూ.90,300 ఆదాయం వచ్చింది.



నిజామాబాద్‌లో ఓ సెంటర్ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి



# పంట నష్టంపై కాకి లెక్కలు!

## క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే అంచనాలు

- వ్యవసాయాధికారులపై రైతుల అసంతృప్తి
- కర్షకుల గోడుకు స్పందించని ఏఈవోలు
- అన్నదాతలకు భరోసా కల్పించలేని దుస్థితిలో యంత్రాంగం
- నిజామాబాద్‌లో కొన్నిప్రాంతాలు, కామారెడ్డిలో అనేకచోట్ల దెబ్బతిన్న పంటలు

నిజామాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, వడగండ్ల వాన అన్నదాతలను ఆగమాగం చేసింది. పంట చేతికొచ్చే సమయంలో వడగండ్లు రైతుకు కన్నీళ్లు మిగిల్చాయి. మంచి దిగుబడి వచ్చిందన్న సంతోషం ప్రకృతి వారిని ఎక్కువసేపు ఉండనీయలేదు. త్వరగా కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి పంటను అమ్ముకుందామనుకునేలోపే అకాల వర్షం వారి ఆనందాన్ని ఆవిరి చేసింది. ఆరబోసిన వడ్ల కుప్పలన్నీ హారతి కర్పూరం మాదిరిగా వరదలో కొట్టుకుపోయాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. అయితే జరిగిన పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయాల్సిన సంబంధిత అధికారులు ఉన్నచోటే కాకిలెక్కలు చూపించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దమొత్తంలో పంటలకు నష్టం వాటిల్లగా అధికార యంత్రాంగం రైతులకు భరోసా ఇవ్వకపోవడం గమనార్హం.

**రైతును దెబ్బతీసిన అకాలం**

యాసంగిలో మరోమారు భారీ వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. నిజామాబాద్ అన్నదాతలను తీవ్రంగా కుంగదీసింది. కురిసిన కుండపోత వానలతో జిల్లాలో వేలాది ఎకరాల్లో వివిధ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అతి భారీ వానలకు తోడుగా గాలి దుమారం తీవ్రంగా చేటు చేసింది. దీంతో ఆరుగాలం సాగులో అన్నదాతకు ఆదిలోనే ఆటంకం ఎదురైంది. ఊహించని విపత్తుతో రైతులను కోలుకోకుండా చేసింది. ఏపుగా ఎదిగిన వరి పంట నేలవాలి పూర్తిగా పనికి రాకుండా పోయాయి. కామారెడ్డి జిల్లాలోని చాలా చోట్ల వరి గింజలు నేల రాలి పనికి రాకుండా మారింది. దెబ్బతిన్న పంటలను చూసి కర్షకులు కంటతడి పెడుతున్నారు. వరుసగా ఎదురవుతున్న నష్టాలను తలచుకుని అధికారులు, ప్రజా ప్రతినిధుల ఎదుట ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పంట నష్ట పరిహారం ద్వారా రైతులకు సాంత్వన చేకూర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ ఈ అంశంపై అతీగతీ లేకుండా పోయింది. సకాలంలో పరిహారం అందివ్వడం ద్వారా కర్షకుడి కన్నీటిని తుడిచేలా తెలంగాణ వ్యవసాయ శాఖ ప్రయత్నిస్తే బాగుండేది. కానీ రైతుబంధు పెట్టుబడి సహాయాన్ని కొర్రీలు పెట్టి కొంత మందికే సాయం అందించిన కాంగ్రెస్ సర్కారుకు పంట నష్టపోయిన రైతులపై ప్రేమ పుడుతుందా? అన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నం అవుతోంది.



**లెక్కల్లో తకరారు..**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 10లక్షల ఎకరాల్లో పంటలు సాగుకు నోచుకున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వరి కోత దశకు చేరింది. నేడో రేపో వడ్లు కుప్ప పోసేందుకు సిద్ధమవుతుండగా అకాల వర్షం కన్నీళ్లు మిగిల్చింది. జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో పెద్దమొత్తంలో పంటలు దెబ్బతిన్నాయి. కామారెడ్డిలోనూ ఇదే దుస్థితి. ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే వివరాలు నమోదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏఈవోలు, మండల వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. కామారెడ్డిలో జిల్లా వ్యవసాయాధికారి విస్తృత పర్యటనలు చేస్తుండగా నిజామాబాద్‌లో పర్యవేక్షణ కరువైంది. దీంతో కింది స్థాయి వ్యవసాయాధికారుల పనితీరుకు లెక్కాపత్రం లేకపోవడంతో లోపాలు వెలుగుచూస్తున్నాయి. బాన్సువాడలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, బోధన్‌లో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కామారెడ్డిలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిలు పంట నష్టం వాటిల్లిన రైతులతో మాట్లాడి సాంత్వన చేకూర్చే ప్రయత్నం చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఫక్తు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు మాత్రం రైతులు కష్టాల్లో ఉంటే కనుచూపు మేరలో కనిపించకపోవడం చర్చకు దారితీస్తోంది.



కామారెడ్డిలో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



కామారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

# పది పరీక్షలు షురూ

## నిజామాబాద్‌లో 21,870, కామారెడ్డిలో11,940 మంది హాజరు

## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, అధికారులు




నిజామాబాద్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థిని

ఖలీల్‌వాడి, మార్చి 18: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 9.30 గంటలకు ముందే సెంటర్ల వద్దకు చేరుకోగా 9.35 గంటల వరకు హాల్లోకి అనుమతించారు. మొదటి రోజు తెలుగు పరీక్ష ఉదయం 9:30 నుంచి 12.30గంటల వరకు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 21,914 మంది విద్యార్థులకు, 21,870 మంది హాజరు కాగా, 44మంది గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. అదనపు కలెక్టర్లతోపాటు డీఈవో, డీఎల్‌వో, ఫ్లయింగ్ స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేశారు.

**కామారెడ్డిలో 11,940 మంది హాజరు**

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 62 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 11,962 మందికి 11,940 మంది హాజరుకాగా, 22 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో రాజు తెలిపారు. ప్రైవేట్‌గా పరీక్ష రాసే 24మంది విద్యార్థులకు ఐదుగురు హాజరయ్యారని, 19 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, వాగ్దేవి హైస్కూల్‌ను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



నిజామాబాద్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



దేవునిపల్లిలో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



కామారెడ్డి జిల్లా దేవునిపల్లి సెంటర్ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి**



బాధితులతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్, మార్చి 18: ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి డిమాండ్ చేశారు. బీర్కూర్ శివారులో శనివారం ఈదురు గాలులకు కూలిపోయిన అన్నపూర్ణ రైస్‌మిల్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతోపాటు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మద్దతు ధర, బోనస్ రూ.500 కూడా అందించాలన్నారు. రైతుబంధు పూర్తిస్థాయిలో ఇవ్వాలని, రుణమాఫీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారని వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రారంభమై 100రోజులు దాటిపోయిందని ఇచ్చిన హామీలను గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల కోడ్ సాకుగా చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, వీలైనంత వరకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్, కోఆప్షన్ సభ్యుడు ఆరిఫ్ తదితరులు ఉన్నారు.

### తులంన్నర బంగారం కోసం..

## తల్లిపై పైశాచిక దాడి

**విచక్షణారహితంగా కొట్టిన కసాయి కొడుకు**

**తీవ్రగాయాలతో దవాఖాన పాలైన మాతృమూర్తి**



గాయపడిన గంగామణి

వినాయక్‌నగర్, మార్చి 18: తులంన్నర బంగారం కోసం నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిపై విచక్షణారహితంగా దాడిచేశాడు ఓ కసాయి కొడుకు. తీవ్ర గాయాలపాలైన ఆ మాతృమూర్తి దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. నగరంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన ముద్దం గంగామణి అనే వృద్ధురాలికి శ్రీనివాస్, ప్రవీణ్ ఇద్దరు సంతానం. గంగామణి పెద్ద కుమారుడైన శ్రీనివాస్ వద్ద ఉంటుంది. ఆదివారం సాయంత్రం ఆమె తన పెద్దకుమారుడి ఇంటి ఎదుట కూర్చొని ఉండగా చిన్న కొడుకు ప్రవీణ్ అక్కడికి వచ్చాడు. ఆమె వద్ద ఉన్న తులంన్నర బంగారం ఇవ్వాలని నిలదీశాడు. తల్లి ఇవ్వబోనని చెప్పడంతో ఆమెపై విచక్షణారహితంగా దాడిచేశాడు. ముఖం, తలపై కొట్టాడు. దీంతో వృద్ధురాలి కన్ను, ముఖం వాచిపోయి రక్తస్రావం అయ్యింది. ప్రతినెలా వచ్చే పింఛన్ డబ్బులు కూడా తనకే ఇవ్వాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆమె మనువడు మనోజ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. దాడికి పాల్పడిన ప్రవీణ్‌పై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లుగా చెప్పారు.

## సీఎంసీని సిద్ధం చేయాలి

**కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

డిచ్‌పల్లి, మార్చి 18: డిచ్‌పల్లిలోని సీఎంసీ(క్రిస్టియన్ మెడికల్ కాలేజీ)ని ఓట్ల లెక్కింపు కోసం సిద్ధం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో పోల్ అయ్యే ఓట్లన్నీ సీఎంసీలోనే లెక్కించనున్న నేపథ్యంలో పక్కాకా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీఎంసీ భవనంలోని గదులను సోమవారం పరిశీలించిన ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. భద్రతాపరమైన అంశాలను నిశితంగా పరిశీలిస్తూ, అవసరమైన మార్పులు, చేర్పులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతర పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి తగిన బందోబస్తు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపుతో పాటు అర్బన్, రూరల్ సెగ్మెంట్ల డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లను కూడా సీఎంసీలోనే చేపట్టనున్నామన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు